# ఉంచుకున్న మనిషి

**సంతలో దుకాణాలు పెట్టడం ఉల్లిపాయల గంగిరెడ్డిని చూసి నేర్చుకున్నాడు లోవరాజు. అయితే గంగిరెడ్డిగారిదంతా నికార్సయిన వ్యాపారం. ఈలోవరాజుది మట్టుకి లొసుగుల యవ్వారం.**

**ద్వారపూడి సంతలో కుళ్ళిపోతున్న పెద్ద ఉల్లిపాయల్ని గుత్తకి మాటాడేసుకుని కోటిపల్లి బస్సులో వేసుకుని మా వూళ్ళోకి తీసుకొచ్చే లోవరాజు సంతలో దుకాణం పెట్టి మూడు వీసెలైతే రూపాయి. వీసె అయితే అర్ధరూపాయని అరిచేవాడు. దాంతో రూపాయిపెట్టి మూడువీసెలు కొన్నామంటే ఒక వీసెఉల్లిపాయలు మిగుల్తాయి అని లెక్కలు వేసే వూరి ఆడాళ్ళు ఆ కుళ్ళిపోయిన ఉల్లిపాయల్ని చవగ్గా కొనేసేమని గొప్పలు చెప్పుకుని వెళ్ళేవారు. సాయంత్రానికి ఉల్లిపాయలన్నీ అమ్మేసి చేతిలో డబ్బులు అయిపోయేదాకా తాగుతానే ఉండేవాడు. దాంతో భార్యా పిల్లలు పనికిరాని చవటలా చూసేవారు లోవరాజుని.**

* * *

నల్లగా ఒళ్ళంతా ఆముదం రాసినట్టు నిగనిగలాడిపోయే ఆ ఆడమనిషి పేరు తలుపులమ్మ. వాళ్ళూరు ఉప్పాడ. ఏ తప్పూ చెయ్యని తనని అనుమానించి మాటాడేట భర్త. దాంతో మర్నాడే ఊళ్ళో పెద్దోళ్ళందర్నీ పిల్చి వాళ్ళ మధ్యలో విడిపోయింది.

మరి తిండి పెట్టడానికి మొగుడు లేడు. బతుకు దెరువుకోసం వాళ్ళూళ్ళో ఎండు చేపలు కొని పెద్దాపురం సంతకి పట్టుకెళ్ళింది. చాలా పెద్ద సంతది. కొన్నివందల ఎండు చేపల దుకాణాలు మధ్యలో తనూ.

పట్టుకెళ్ళిన సరుకు మధ్యాన్నానికే అయిపోయింది. లాభం పర్లేదు. అక్కడ్నించి వారమంతా సంతల కెళ్ళడానికి ఒకోరోజూ ఒకో ఊరు చప్పున ఏడూళ్ళు చూసుకుంది.

ఆరోజు పెనుగుదురు సంత కెళ్ళింది.

బేరాలు మంచి ముమ్మరంగా సాగుతున్న టైంలో ఒంటెద్దు బండి మీద సరుకేసుకు దిగిన లోవరాజు ''ఇది నా స్థలం. ఇయ్యాళ కొంచెం ఆలస్యంగా వచ్చేను కాళీ చెయ్'' అన్నాడు.

ఆశీలు వసూలు జేసే వాడొస్తే వాడి చొక్కా పట్టుకున్నాడు లోవరాజు.

"నీక్కావాలంటే ఇంకోచోటు చూపిస్తాను. ఇయాల్టినించీ ఇది ఈ అమ్మిది" అన్నాడు ఆశీలవాడు.


ఇక చేసేది లేక అటు వేపెళ్ళేడు లోవరాజు.



అలాగ నరసాపురప్పేట సంతలోకూడా గొడవైంది. ఇంకోసారి వేళంగి సంతలో గొడవైంది.

ఎప్పుడు గొడవలు పడ్డా తలుపులమ్మే నెగ్గుతుంది.

ఓరోజయితే ఓడిపోయిన మొకాన్ని ఆంబోతు బుడ్డలా గెట్టుకుని వెళ్ళిపోతున్న లోవరాజుని జూసిన తలుపులమ్మకి జాలేసింది. పాపం అని కనికరించి పలకరిద్దావని జూసింది. మళ్ళీ ఎక్కడ లోకువైపోతానో అని



వెనక్కి తగ్గింది.

ఆరోజు అచ్చంపేట సంత.

మిగతా సరుకంతా అయిపోయిందిగానీ తట్టం చేప ఒకటి గావాల్సు మిగిలింది. ఆ ఒక్కదాన్నీ అమ్ముదామని చూస్తుండగా చాలా చీకటి పడిపోయింది. బరకం గుడ్డలోంచి ఇలాయిబుడ్డి దీసి వెలిగించింది.

ఆ తట్టం చేప అమ్ముడవలేదుగానీ ఆకాశవంతా కుదుమట్టంగా మబ్బులట్టి గాలి వెయ్యడం మొదలెట్టింది.

అన్నీ బుట్టలో సర్దేసుకుని బస్సుకోసమని రోడ్డు పక్క పాకలో నిలబడింది. ఒకటే గాలి దుమారం ఎంత సేపయినా బస్సు రాలేదు. కాస్సేపటికి ఇంకో మనిషి దిగడ్డాడు పాకలోకి. చూస్తే లోవరాజు.

గాలి బాగా పెరిగిపోయింది. నిద్రగన్నేరు చెట్ల కొమ్మలన్నీ విరిగిపోతున్నాయి.

కాస్సేపటికే జనసంచారం లేకండా పోయిందక్కడ.

అట్నుంచిగానీ ఇట్నుంచిగానీ ఒక్క బస్సూ రావడం లేదు.

వర్షం మట్టుకే చాలా పెద్దగా కురవడం మొదలెట్టింది. సుళ్ళు తిరుగుతా గాలి.

పాకలో తలుపులమ్మా, లోవరాజు మట్టుకే ఉన్నారు.

''ఎడాపెడా చెట్లు కూలినట్టున్నాయి'' గునుస్తూ అన్నట్టన్నాడు లోవరాజు.

ఏవన్లేదు తలుపులమ్మ.

''చలీ బెట్టడం లేదా నా దగ్గర రగ్గుంది కప్పుకో'' అని తన గోనెసంచిలోంచి ముతక రగ్గొకటి తీసి తలుపులమ్మ కిచ్చేడు.

మొత్తం కప్పేసుకున్న తలుపులమ్మ పాక చూరు దగ్గర నిలబడ్డ లోవరాజుని చూస్తా నోరు విప్పింది. ''రగ్గంతా నన్నే కప్పుకో మంటన్నావేంటి మరి నీకో'' అంది.

''పర్లేదు...పర్లేద''న్నాడు లోవరాజు.

''ఏంటి పర్లేదు ఈ మొసం నువ్వు లాక్కుని కప్పుకో... దా'' అని రగ్గు రెండో పక్క లోవరాజు కిచ్చింది.

ఇద్దరూ రగ్గుని చెరి సగంగా కప్పుకున్నారు.

చెలెక్కువై రగ్గుని తన పక్కకి లాక్కుంటున్నప్పుడు ఒకళ్ళ శరీరాలొకళ్ళకి తగుల్తున్నాయి వేడిగా. ఆ వెచ్చదనం ముందు రగ్గు వెచ్చదనం బలాదూరు అనిపించింది.

రగ్గుని దగ్గరకి లాక్కునే ప్రయత్నంలో ఒకళ్ళ శరీరం ఒకళ్ళకి తగిలింది.

గమ్మత్తయిన రాపిడీ, వెచ్చ వెచ్చగా హాయిగా ఉందది. ఎండు చేపల వాసనా కుళ్ళిపోయిన ఉల్లిపాయల వాసనా కలగలిపి వస్తున్నాయి.

వర్షం ఎక్కడా ఆగడం లేదు బోరుమంటా కురుస్తానే ఉంది.

టైమెంతయిందో తెలీదు. నరమానవుడు లేడా ప్రాంతంలో.

''ఆకలేస్తందా నీకు?'' అడిగేడు లోవరాజు.

''ఆ...'' అడిగింది తలుపులమ్మ.

''కొనుక్కుని తిందారంటే ఈ టైములో ఏదీ దొరకదిక్కడ''.

మాటాడ్లేదు తలుపులమ్మ.

''ఈ రాత్రికి ఇక్కడే లాగుంది మన మకాం'' అన్నాడు.

ఏ సమాధానమూ ఇవ్వని తలుపులమ్మ చలి మరీ ఎక్కువయ్యేసరికి వాడికి బాగా దగ్గరగా జరిగింది.

జబ్బ ఎడం పక్క లాగినట్టు కొంచెం చాపుకుందావన్నట్టు విదిలించిన చెయ్యి తలుపులమ్మ భుజం మీదేసేడు.

ఏం మాటాడలేదు తలుపులమ్మ. దాంతో భుజం మీదున్న చేతిని నడుం మీదికి జరిపేడు.

అయినా ఏం మాటాడలేదు తలుపులమ్మ.

నడుం మీద ఊరికే అలాగున్న చేతిని తలుపులమ్మ నడుం చుట్టూరా బిగించేడు.

హోరుగాలీ వర్షం ఇయాళ్ళికి తగ్గేలా లేదు.

సుతిమెత్తగా తలుపుల్ని దగ్గరకి లాక్కుని కటికినేల మీద పడుకోబెట్టి ఆ మనిషిమీద తను పడుకుని నిండా రగ్గు కప్పేసుకున్నాడు.

వర్షం మట్టుకు కురుస్తానే ఉంది.

తలుపులమ్మ మీద పడుకున్న లోవరాజు మోకాళ్ళు కొట్టుకుపోతున్నా ఆగకుండా తెగ కుమ్మేస్తున్నాడు. ఆ కటిక నేలమీద దేకిం చేస్తున్నాడు మనిషిని.

అలాంటి రుచి తన జన్మలో ఎరగని తలుపులమ్మకి అదోరకం మూర్ఛ వచ్చినట్టయ్యింది.

ఆ తర్వాతనించి తలుపులమ్మకి ప్రాణం అయిపోయేడు లోవరాజు. దాంతో ''ఈ జన్మకి నీ సొంతం నేను'' అని ఒట్టేసుకుంది.

ఇక అక్కడ్నించి సంతల్లో ఇద్దరి దుకాణాలు పక్క పక్కనే. దుకాణాలు పెట్టే తక్కిన వాళ్ళందరికీ వీళ్ళ గురించి తెల్సిపోయింది.

లోవరాజుతో ''నేను ఉప్పాడ నించి వచ్చేస్తాను. మీ పక్క ఎక్కడన్నా కాపరం పెడదాం... ఖర్చుకి ఆలోచించకు నే జూసుకుంటాను'' అంది.

''సరే'' అన్నాడు. ఈంద్రపేటలో ఇల్లు తీసి కాపురం పెట్టాడు.

ఊరంతా తెల్సిపోయింది.

''ఆడికంటే పదిహేనేళ్ళు చిన్నది తలుపులమ్మ. మొత్తానికి భళే అదృష్టవంతుడు ఆ లోవరాజుగాడు'' అనుకున్నారంతా.

తలుపులమ్మ ఉంచుకున్నాకా లోవరాజు ఉల్లిపాయల వ్యాపారం మానేసేడు.

రాత్రనక పగలనకా రకరకాల సంతలు తిరిగి ఉప్పు చేపలు అమ్మి లోవరాజుతో బాటు, అతని కుటుంబాన్నికూడా పోషిస్తుంది తలుపులమ్మ.

లోవరాజు పెళ్ళాం సీతాలు మాత్రం తలుపులమ్మ కనపడితే చాలు ఊరంతా వినపడేలా రంకెలేస్తూ ''నా మొగుడికి మందోమాకో పెట్టి నాక్కాకుండా చేసేసింది బాడుకా నా సైతి'' అని తిడ్తంది. దానికి కూడా నవ్వుతూ వెళ్ళిపోతుంది తప్ప లోవరాజునిగానీ, అతని పెళ్ళాన్నిగానీ చిన్నముక్క అనేది గాదు.

తలుపులు సంపాదిస్తుంటే పగలూ రాత్రీ కన్నూమిన్నూ గాకండా తాగేస్తున్నాడు లోవరాజు. సాయంత్రమైతే ఇంటిగుమ్మం ముందు నిలబడ్డ లోవరాజు చిన్నకొడుకు ''అమ్మ డబ్బులిమ్మంటుంది'' అని చెప్పి సంపాయించిన డబ్బుల్లో సగం పట్టుకెళ్ళిపోయేవాడు.

కాకినాడ, రాజమండ్రీ వెళ్తే లోవరాజుకి చిన్న పిల్లోడికి కొన్నట్టు చిన్న బ్రాందీ సీసాకాయ కొని బొడ్లో దోపుకుని తెచ్చి పొద్దోయేదాకా

బియ్యంపెట్లో దాచి తర్వాత ఇచ్చేది. కోడిగుడ్ల కూర వండితే పుంజీడుగుడ్లకి పైగా పులుసులో వేసేది. అప్పుడప్పుడూ లోవరాజుసారాకి డబ్బులు లేకపోతే తన పాత చీరలూ, ఇత్తడిబిందెలూ, నల్లకాంతమ్మ దగ్గర తాకట్టు పెట్టి ఆ పూటకి సారా ఏర్పాటు చేసేది. ఒక్కసారైతే లోవరాజు సారాకి డబ్బులు లేకపోతే ఎప్పుడూ తియ్యని తన ముక్కుకున్న బేసర తీసి తాకట్టు పెట్టి ఇచ్చింది.

సర్వాయితోటలో పైడియ్యని మంచి చేసుకుని నాటుసారా, చిగురు ఎలా తయారుచెయ్యాలో తెల్సుకుని లోవరాజుకి ఆ చిగురు కాచి ఇవ్వడంమొదలెట్టింది తలుపులు. తాగేటప్పుడు నంజుకి ఉప్పుచేపల్ని మంచినూనెలో దోరగా వేపి ఉప్పూకారం జల్లి పెట్టేది. వర్షాకాలాల్లో చిగురు పుచ్చుకుని తలుపులమ్మమీద పడుకుని తెగ రెచ్చిపోయేవాడు లోవరాజు.

ఊళ్ళో ఏ మొగుడూ పెళ్ళాలూ ఉండనంత ఇదిగా ఉంటున్నారు వాళ్ళిద్దరూ.

లోవరాజుతో కాపరం పెట్టాకా దేవుడు నా ఇంట్లోనే ఉన్నాడు ఇంకెందుకూ అనేసి అసలు దేవుడికి పూజలు చెయ్యడం మానేసింది తలుపులమ్మ. ఇద్దరూ ఎంత ప్రాణంలో ప్రాణంలాగ కల్సిపోయున్నా ఉంచుకున్నది గాబట్టి చూసేవాళ్ళకి చిన్న చూపే తలుపులమ్మ మీద.

చిన్నంవారి అరుగు మీద మిషనుకుట్టే త్యాగరాజు నా దగ్గరకొచ్చెయ్యి ''ఆరిపోయిన ఆముదం కాగడాలాగుంటది ఆలోవరాజుగాడి ముకం ఆడికంటే నే బావుంటాను గదా?'' అన్నాడు.

కంసాలోళ్ళ గున్నయ్యగాడుకూడా అదే అన్నాడు.

''రాత్రి చెంబెట్టుకుని రోగిబీట్లోకి వెళదాంగదా ఆ టైములో అలా సీమ సింతచెట్టు దగ్గరకి లాక్కుపోదారి'' అన్నాడు త్యాగరాజు.

''మంచి అవిడియా'' అన్నాడు గున్నయ్యగాడు.

రాత్రి బాగా చీకటి పడ్డాకా వాళ్ళిద్దరూ చిన వెంకటరాజు డాబా వెనక్కి జేరేరు.

చెంబుతో రోగిబీట్లోకి వెళ్తున్న ఆడోళ్ళు కాస్సేపటికి ఖాళీ చెంబుల్తో తిరిగొస్తున్నారు.

వాళ్ళ ఎదురుచూపులన్నీ తలుపులమ్మకోసం.

ఊరు మాటు మణిగింది.

కారు చీకటి.

అన్నపూర్ణ కావిడివాడు గంటలు మోగించుకుంటా మున్సబుగారి తూము దాటెళ్ళి పోయాడు. భోగంసూరమ్మ అరుగుమీద సూడికుక్క మూలుగుతుంది. బరువుగా నాగయ్యగారి దడిలోంచి తప్పించుకున్న సూడిపంది పెరుగునూతి పళ్ళెం మీద పడుకుని గునుస్తుంది.

అంతలో, మువ్వలపట్టాల చప్పుడు.

ఆ చప్పుడొస్తున్న వేపు తిప్పేరు.

తెల్లటి వాయిలు చీర కట్టుకున్న తలుపులు ఇత్తడినీళ్ళ చెంబు పట్టుకుని వస్తుంది.

వాళ్ళిద్దరికీ జొరాలొచ్చేసినియ్యి.

రోగి బీట్లోపలికి వెళ్ళబోతున్న ఆ మనిషి రెక్క పట్టుకుని పక్కకి లాగెయ్యబోతున్న త్యాగరాజుగాడి మెడకాయ మీద ఒక్కటేసింది

చెంబుతో. మీదికి రాబోయిన గున్నయ్య నడ్డిమీద తన్నింది.

ఆ చీకట్లో ఆ మనిషితలో రెక్కా పట్టుకు లాక్కుపోదామని ముందుకొస్తున్న ఆ ఇద్దరి మూతుల మీదా ఇత్తడి చెంబుతో మొత్తింది. దాంతో వాళ్ళ మూతులు కాలవ దగ్గర గుళ్ళో ఆంజనేలు సామి మూతిలా ఉబ్బిపోయినియ్యి.

మర్నాడు. "మూతులూ ఏంట్రా అలాగున్నాయి" అని బ్రాహ్మణరెడ్డిగారి తమ్ముడు సుబ్బారెడ్డిగారు అడిగితే నవ్వూ ఏడుపూ కలిసొచ్చినియ్యి తప్ప నోటమాట రాలేదు వాళ్ళకి.

కొంతమంది ఏవేవో లోవరాజుకి ఎక్కిస్తే...మత్తులో మాత్రం ఆమనిషిని తిట్లు తిడుతూ ఇంటిచుట్టూ తిప్పేసి... తిప్పేసి తన్నులు తన్నినప్పుడు ... నువ్వుతూనే ఆ తన్నులూ తిట్లూ భరించేది. కానీ పల్లెత్తు మాటనేది కాదు. అయితే అంత మందులోనూ తిట్టేవాడు కొట్టేవాడుగానీ నువ్వు గుడిసేటి దానివి అని మాత్రం ఏనాడూ అనేవాడు కాదు లోవరాజు. నిత్యం ఇదే తంతు. అలవాటైన ఆ తంతును సరదాగా మార్చేసుకుంది. చివరికి ఆ తిట్లూ... ఆ దెబ్బలు లేకపోతే ఏదోలా వున్నట్టు అన్పించేది.

ఓ రోజున లోవరాజు బాగా తాగేసి తలుపులమ్మ చేతిని మెలి తిప్పేసాడు.

మర్నాడు ఊళ్ళోవాళ్ళు. చేతికా కట్టేంటి అనడిగితే, రాతిరి స్నానాల దడిలో నాచు పట్టిన నాపరాయి మీద పడ్డాను అని గుట్టును పాతి పెట్టేసింది. లోవరాజుకి ఎదురుబాము వేసి జ్వరం వస్తే వేణుగోపాలస్వామిగుళ్ళో లోవరాజు పేర్న పూజలు అయ్యా చేయించి ప్రసాదం పట్టుకెళ్ళి అతని భార్య సీతాలు కిస్తే తన కంటిముందే కోడిగుడ్డు దీపం బుడ్డి పెట్టే కిటికీ గూట్లో పెట్టి వెళ్ళిపోయింది సీతాలు.

లోవరాజు కష్టసుఖాలు పంచుకున్న తలుపులమ్మ అతని పిల్లలకి కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసి పంపించి అతనింటికి కనిపించని పునాదిలా వుండిపోయింది.

వయస్సు పైబడిన లోవరాజు చూపు తగ్గింది. దాంతో తలుపులమ్మ ఇంట్లోనే ఎక్కువ ఉండేవాడు. అప్పుడప్పుడూ పెళ్ళాం సీతాలూ పిల్లలమీద బెవారినప్పుడు తలుపులమ్మకి చెప్పేవాడు. చీకటిపడిన తర్వాత లాంతరు బుడ్డీ తీసుకుని లోవరాజుని సీతాలు ఇంటి దగ్గర దిగబెట్టేసి వచ్చేది తలుపులమ్మ.

సీతాలింట్లో ఉండగానే ఒకరోజు నిద్దట్లో పోయేడు లోవరాజు.

పదకొండోరోజున గాజులు, పసుపుకుంకాలు తీసేసిన తలుపులమ్మ ఆరోజునించి పూలు పెట్టుకోవడం రంగుచీరలు కట్టడం మానేసింది. అది చూసిన రాజుల సుబ్బమ్మగారు "ఏంటి తలుపులమ్మా ఇది?" అంది.

నవ్విన తలుపులమ్మ "అతను నన్ను ఉంచుకున్నాడు అనేసి చెప్పుకుంటారు. నేనతన్ని పంచుకున్నానండి. ఈ ముక్క నేనెవరికీ చెప్పుకోనండి" అంది.

లోవరాజు పోయాకా ఊళ్ళోవాళ్ళే గాకండా పులగుర్తా, లొల్ల, రాయవరం, కొంకుదురు, ఇలాగ చాల ఊళ్ళనించి చాలా మంది కబుర్లెట్టేరు. అలా వచ్చిన అందరికీ ఇంకెప్పుడూ రావొద్దండి అనేసి పెద్ద దణ్ణం పెట్టింది. అలా దణ్ణం పెడ్తున్న ఆ మణిషిని చూస్తుంటే వేదాల్లోనూ, పురాణాల్లోనూ ఉండే గొప్పగొప్ప ఆడమణుషులంతా గుర్తుకొచ్చి మహాపతి వ్రతయిన తలుపులమ్మకి మనసారా దణ్ణమెట్టుకున్నాన్నేను.

* * *